అరెస్టుకు కారణాలు తెలపాల్సిందే

- ఉల్లంఘిస్తే అదే బెయిల్‌కు ఆధారం
- అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు

ప్రయాగ్‌రాజ్, ఏప్రిల్ 12: రాజ్యాంగంలోని 22(1) అధికరణ ప్రకారం అరెస్టు చేసిన సమయంలో నిందితుడికి అందుకు గల కారణాలు తెలపడం తప్పనిసరని అలహాబాద్ హైకోర్టు ఇటీవల ఓ తీర్పులో స్పష్టం చేసింది. బెయిల్ ఇవ్వడానికి చట్టపరమైన అభ్యంతరాలు ఉన్నప్పటికీ రాజ్యాంగ ఉల్లంఘనే బెయిల్ మంజూరుకు ప్రధాన కారణంగా నిలుస్తుందని తెలిపింది. ఉత్తర్ ప్రదేశ్‌లోని రాంపూర్ మెజిస్ట్రేట్ నిరుడు డిసెంబర్‌లో ఇచ్చిన ఉత్తర్వును పక్కనపెట్టిన హైకోర్టు తనను అరెస్టు చేయడానికి కారణాలు ఏమిటో తనకు తెలియచేయలేదన్న పిటిషనర్ వాదనను ప్రధానంగా ప్రస్తావించింది. మంజీత్ సింగ్ అనే వ్యక్తిపై 2024 ఫిబ్రవరి 15న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. డిసెంబర్ 26న పిటిషనర్‌ను అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ప్రింటెడ్ రిమాండ్ ద్వారా నిందితుడిని జుడిషియల్ రిమాండ్‌కు పంపించారు. అరెస్టుకు గల కారణాలను తెలియచేయకుండా తనను జుడిషియల్ రిమాండుకు పంపించారని మంజీత్ సింగ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ మహేష్ చంద్ర త్రిపాఠి, జస్టిస్ ప్రశాంత్ కుమార్‌తో కూడిన ధర్మాసనం మెజిస్ట్రేట్ ఉత్తర్వులను తప్పు పట్టింది. అరెస్టుకు గల కారణాలను తెలియచేయడం రాజ్యాంగంలోని 22(1) అధికరణ కింద తప్పనిసరని తెలిపింది. నిందితుడిని రిమాండ్‌కు తరలించే ముందు ఆ వ్యక్తికి గల రక్షణలను నిర్ధారించుకోవాల్సిన బాధ్యత మెజిస్ట్రేట్‌కు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. 22(1) అధికరణ ఉల్లంఘన జరిగినట్లు తేలినపుడు తక్షణమే నిందితుడి విడుదలకు ఆదేశాలు జారీ చేయాల్సిన బాధ్యత కోర్టుకు ఉందని తెలిపింది. బెయిల్ మంజూరు చేసేందుకు చట్టపరమైన ఆంక్షలు ఉన్నప్పటికీ 22(1) అధికరణ ఉల్లంఘనే బెయిల్ మంజూరుకు ప్రధాన ఆధారంగా చూడాలని ధర్మాసనం పేర్కొంది. అరెస్టు అయిన వ్యక్తులకు అర్థమయ్యే రీతిలో ఎందుకు అరెస్టు చేస్తున్నామో లిఖితపూర్వకంగా సమాచారం అందచేయాల్సిన తప్పనిసరి బాధ్యత పోలీసులకు ఉంటుందని చెప్పింది. ఈ కేసులో పిటిషనర్‌కు బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 47 కింద తన అరెస్టుకు గల కారణాలను అందచేయలేదని, కారణాలు లేని అరెస్టు మెమోను మాత్రం అందచేశారని కోర్టు తెలిపింది. అరెస్టు చేసిన వ్యక్తిని జుడిషియల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచినపుడు 22(1) అధికరణ కింద నిబంధనలు పాటించారో లేదో నిర్ధారించుకోవాల్సిన బాధ్యత మెజిస్ట్రేట్‌కు ఉంటుందని, దాని ఉల్లంఘన జరిగిందని నిర్ధారించుకున్న వెంటనే నిందితుడిని విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని తెలిపింది. ఇతర బెయిల్ నిబంధనలు ఎలా ఉన్నప్పటికీ ఇదే బెయిల్ మంజూరుకు ప్రధాన ఆధారంగా మారుతుందని హైకోర్టు వివరించింది. 2024 డిసెంబర్ 26న మెజిస్ట్రేట్ జారీ చేసిన ఉత్తర్వులను పక్కనపెడుతూ ఏప్రిల్ 9న తీర్పు ఇచ్చిన హైకోర్టు, పిటిషనర్ అరెస్టును కొట్టివేసింది.

మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలి

- గవర్నర్లు పంపే బిల్లులపై రాష్ట్రపతికి సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశం
- తిరస్కరించే అధికారం లేదు.. మీ అధికారాలు మా న్యాయ సమీక్ష పరిధిలోకి వస్తాయని స్పష్టీకరణ
- దేశ చరిత్రలో ప్రెసిడెంట్‌కు తొలిసారి కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ: గవర్నర్లు నివేదించిన బిల్లులపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని రాష్ట్రపతిని దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలియచేయకుండా ఆ రాష్ట్ర గవర్నర్ నిరవధికంగా పెండింగ్‌లో ఉంచడాన్ని తప్పు పడుతూ మంగళవారం దేశ చరిత్రలో మొట్టమొదటిసారి రాష్ట్రపతి అధికారాలకు సంబంధించి సంచలన తీర్పును వెలువరించింది. శుక్రవారం ఆ ఉత్తర్వులను బహిర్గతం చేసింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం రాజ్యాంగంలోని 201 అధికరణ కింద రాష్ట్రపతి నిర్వహించాల్సిన బాధ్యతలు న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. 201 అధికరణ ప్రకారం గవర్నర్ ఒక బిల్లుకు సమ్మతి తెలియచేయకుండా రిజర్వ్‌లో ఉంచితే అప్పుడు అది రాష్ట్రపతి పరిధిలోకి వెళుతుంది.. దానికి రాష్ట్రపతి సమ్మతి తెలియచేయాల్సి ఉంటుంది. అయితే ఇందుకు కాల పరిమితిని రాజ్యాంగం నిర్దేశించలేదు. కాగా, అలాంటి బిల్లులను తిరస్కరించే అధికారం రాష్ట్రపతికి లేదని, సమ్మతి తెలియచేయడం లేదా పెండింగ్‌లో ఉంచడం తప్ప రాష్ట్రపతికి వేరే ప్రత్యామ్నాయం లేదని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. రాజ్యాంగంలో లేదా చట్టంలో నిర్ణయం తీసుకునేందుకు కాల పరిమితిని నిర్దేశించనప్పటికీ తగిన సమయంలోగా తన నిర్ణయాన్ని వెల్లడించాల్సిన బాధ్యత ఉంటుందని కోర్టు తెలిపింది. 201 అధికరణ కింద రాష్ట్రపతి నిర్వర్తించే అధికారాలు ఈ చట్టానికి అతీతమని భావించరాదని పేర్కొంది. మూడు నెలలకు మించి జాప్యం జరిగిన పక్షంలో తగిన కారణాలను నమోదు చేసి సంబంధిత రాష్ట్రానికి తెలియ చేయాల్సి ఉంటుందని ధర్మాసనం తీర్పులో ఆదేశించింది.

గవర్నర్ నివేదించిన బిల్లులపై తనకు బిల్లులు అందిన తేదీ నుంచి మూడు నెలల్లోగా రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నిర్ణీత కాల పరిమితిలోగా ఎలాంటి చర్య తీసుకోని పక్షంలో సంబంధిత రాష్ట్రాలు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని కూడా ధర్మాసనం పేర్కొంది. రాజ్యాంగపరమైన చెల్లుబాటు కారణాలతో బిల్లును రిజర్వ్‌లో ఉంచిన పక్షంలో న్యాయస్థానాల పాత్రను తక్కువగా అంచనా వేయవద్దని ధర్మాసనం పేర్కొంది. రాజ్యాంగంలోని 143 అధికరణ కింద తమకు ఎదురవుతున్న ప్రశ్నలను సుప్రీంకోర్టుకు నివేదించవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. బిల్లులోని న్యాయపరమైన అంశాలపై గవర్నర్లు లేదా రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవడానికి వెనుకాడతారని చెప్పడానికి తమకు ఎటువంటి మొహమాటం లేదని చెప్పింది. అయితే రాజ్యాంగాపరంగా ఏర్పడిన కోర్టులకు మాత్రమే బిల్లుకు సంబంధించిన రాజ్యాంగబద్ధతను అధ్యయనం చేసి తగిన సిఫార్సులు చేసే అధికారం ఉందని ధర్మాసనం తెలిపింది. డీఎంకే ప్రభుత్వం ఆమోదించిన 10 బిల్లులకు సమ్మతి తెలియచేయకుండా పెండింగ్‌లో పెట్టి తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడ్డారని సుప్రీంకోర్టు మంగళవారం తన తీర్పులో పేర్కొంది. బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి గవర్నర్లకు మార్గదర్శకాలను జారీ చేసిన సుప్రీంకోర్టు తమ ఆదేశాలను పాటించని పక్షంలో న్యాయ సమీక్షను ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా హెచ్చరించింది.

గవర్నర్‌కు విచక్షణాధికారాలుండవు

రాజ్యాంగంలోని అధికరణ 200 ప్రకారం మంత్రి మండలి సలహా, సూచనల మేరకు పని చేయడం తప్ప గవర్నర్‌కు విచక్షణాధికారాలు ఉండవని కోర్టు స్పష్టం చేసింది. ఈ నిబంధనలకు సంబంధించిన మినహాయింపులను అధికరణ 200, అధికరణ 162(1) రెండో నిబంధనల్లో గుర్తించవచ్చునని తెలిపింది. అంతేకాక న్యాయస్థానం గవర్నర్ అధికారాలను ఏ విధంగానూ బలహీనపర్చడం లేదని, గవర్నర్ చర్యలన్నీ పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా ఉండాలని మాత్రమే స్పష్టం చేసిందని సుప్రీంకోర్ట్ తీర్పు పేర్కొంది. మంత్రివర్గ ప్రతిపాదనలో ఆయన అనుభవాన్ని వినియోగించి నిర్మాణాత్మక పాత్రను వహించాలని పేర్కొంది.

బిల్లులపై గవర్నర్లకు సుప్రీంకోర్ట్ డెడ్‌లైన్

- రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు బిల్లుకు సమ్మతి తెలియచేయడం లేదా రిజర్వ్‌లో పెట్టడానికి-**1 నెల**
- రాష్ట్ర ప్రభుత్వ సూచనకు వ్యతిరేకంగా బిల్లుకు సమ్మతిని పెండింగ్‌లో ఉంచడానికి- **3 నెలలు**
- రాష్ట్ర ప్రభుత్వ సూచనకు వ్యతిరేకంగా బిల్లును రాష్ట్రపతికి నివేదనకు-**3 నెలలు**
- రాష్ట్ర అసెంబ్లీ రెండోసారి బిల్లును ఆమోదించి పంపిన తర్వాత సమ్మతి తెలియచేసేందుకు-**1 నెల.**

వాళ్లే నిర్ణయిస్తే పార్లమెంట్ ఎందుకు?

- బిల్లులపై గవర్నర్లకు డెడ్‌లైన్ విధింపు 'అతి స్పందన'
- మీ కారణాలు మీకుంటే.. మా కారణాలు మాకుంటాయి
- సుప్రీంకోర్టు తీర్పుపై కేరళ గవర్నర్ తీవ్ర వ్యాఖ్యలు

తిరువనంతపురం, ఏప్రిల్ 12: శాసనసభ ఆమోదించిన బిల్లులను ఆమోదించడంలో గవర్నర్లకు కాల పరిమితిని నిర్దేశిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును అతి స్పందనగా కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అభివర్ణించారు. బిల్లులను ఆమోదించడం వంటి అంశాలపై పార్లమెంట్ నిర్ణయం తీసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలియచేయకుండా తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి నిరవధికంగా పెండింగ్‌లో ఉంచడాన్ని చట్ట వ్యతిరేక, ఏకపక్ష చర్యగా సుప్రీంకోర్టు తన తీర్పులో తప్పుపట్టడం గురించి ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అర్లేకర్ మాట్లాడుతూ నిర్దిష్ట కాల వ్యవధిలో గవర్నర్ బిల్లులపై నిర్ణయం తీసుకోవాలని రాజ్యాంగంలో ఎక్కడా లేదని అన్నారు. తమిళనాడు గవర్నర్‌పై డీఎంకే ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం దీన్ని రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించి ఉండాల్సిందని ఆయన సూచించారు. గవర్నర్లకు నిర్ణీత కాల వ్యవధిని నిర్దేశించడం రాజ్యాంగ సవరణ పరిధిలోకి వస్తుందని, ఇక న్యాయస్థానమే రాజ్యాంగ సవరణ కూడా చేస్తే అసెంబ్లీలు, పార్లమెంట్ అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పును అతి స్పందనగా ఆయన అభివర్ణించారు. ''కొన్ని కేసులు ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉంటాయి. అందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు వారి కారణాలు వారికి ఉంటాయి. కొన్ని బిల్లులను క్లియర్ చేసేందుకు సమయం పట్టవచ్చు. అందుకు గవర్నర్‌కూ తన కారణాలు తనకుంటాయి'' అని అర్లేకర్ వ్యాఖ్యానించారు.

సుప్రీంకోర్టు తీర్పు ప్రభావం కేరళపై ఏమాత్రం ఉండబోదని, తన వద్ద ఎటువంటి బిల్లులు పెండింగ్‌లో లేవని అర్లేకర్ పేర్కొన్నారు. తనకు ముందు కేరళ గవర్నర్‌గా పనిచేసిన ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌కు, ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు మధ్య విభేదాలు ఉన్న విషయాన్ని గురించి ప్రశ్నించగా తనకు ముఖ్యమంత్రితో సత్సంబంధాలు ఉన్నాయని, ఏవైనా వివాదాస్పద అంశాలు ఉంటే కూర్చుని చర్చించుకుంటామని అర్లేకర్ వివరించారు.

గ్లైడ్ బాంబ్ పరీక్ష సక్సెస్

సుదీర్ఘ లక్ష్యాలను ఛేదించే సత్తా

న్యూఢిల్లీ: లాంగ్ రేంజ్ గ్లైడ్ బాంబ్ (ఎల్ఆర్‌జీబీ) 'గౌరవ్'ను డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించింది. ఈ నెల 8 నుంచి 10 వరకు ఈ పరీక్షలు జరిగాయి. ఎస్‌యూ-30 ఎంకేఐ విమానం నుంచి ఓ దీవిలోని భూమిని లక్ష్యంగా చేసుకుని డీఆర్‌డీవో దీనిని ప్రయోగించింది. 100 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ వివరాలను తెలిపింది. ఈ పరీక్షలు విజయవంతం కావడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీవో, వాయు సేనలను అభినందించారు. ఎల్ఆర్‌జీబీ గౌరవ్ వెయ్యి కేజీల శ్రేణిలోని గగనతలం నుంచి ప్రయోగించే గ్లైడ్ బాంబు. సుదూరంలోని లక్ష్యాలను ఇది ఛేదించగలదు. ఐఎన్ఎస్, జీపీఎస్ డేటాను ఉపయోగించుకుని ఇది లక్ష్యాన్ని ఛేదిస్తుంది. బాంబ్‌ను స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు. ఇది విజయవంతమవడంతో ఆయుధ తయారీ రంగంలో ప్రభుత్వ- ప్రైవేట్ భాగస్వామ్యానికి మరింత ఊపు వచ్చింది.

కథక్ నృత్యకారిణి కుముదిని కన్నుమూత

అహ్మదాబాద్, ఏప్రిల్ 12: గుజరాత్‌కు చెందిన ప్రముఖ కథక్ నాట్య కళాకారిణి, నృత్య దర్శకురాలు కుముదిని లాఖియా(95) శనివారం అహ్మదాబాద్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆమె కొంత కాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధ పడుతున్నారు. కథక్ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన కుముదినీ నాట్య రంగానికి అందచేసిన సేవలకు గుర్తింపుగా ఈ సంవత్సరం కేంద్రం ఆమెకు పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందించింది. 1964లో ఆమె నృత్య, సంగీత శిక్షణ కోసం కదంబర్ సెంటర్‌ను స్థాపించారు. హిందీ చిత్రం ఉమ్రావ్ జాన్(1981)కు ఆమె కొరియోగ్రాఫర్‌గా పనిచేశారు. కుముదినీ మృతికి ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు.

కల్పవృక్షంతో కనక వర్షం!

రాత్రికి రాత్రే కోటీశ్వరుడైన రైతు

ముంబై, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లాకు చెందిన ఓ రైతు తన వ్యవసాయ భూమిలో ఉన్న ఓ చెట్టుతో రాత్రికి రాత్రే కోటీశ్వరుడయ్యాడు. పుసాద్ తాలూకా ఖుర్షి గ్రామంలో నివసించే కేశవ్ షిండేకు 7 ఎకరాల పూర్వీకుల పొలంలో ఒక రక్త చందన చెట్టు ఉంది. కోట్లలో విలువ చేసే దాని గురించి వారికి తెలియదు. ఒక ప్రాజెక్టు కోసం రైల్వే ఈ భూమిని స్వాధీనం చేసుకుంది . తర్వాత చెట్టు గురించి తెలిసి అంచనా వేయిస్తే దాని విలువ రూ.4.97 కోట్లుగా తేల్చింది. అయితే అంత మొత్తం ఇవ్వడానికి రైల్వే శాఖ నిరాకరించింది. దీంతో షిండే బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ చెట్టు విలువ మదింపునకు ముందస్తుగా కోటి రూపాయలు జమ చేయాలని రైల్వే శాఖను కోర్టు ఆదేశించింది.

గవర్నర్ ఆమోదం లేకుండానే.. 10 బిల్లులకు చట్టరూపం

సుప్రీంకోర్ట్ తాజా తీర్పు నేపథ్యంలో తమిళ నాడులో చరిత్రాత్మక ఘటన

చెన్నై, ఏప్రిల్ 12: తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం ఆమోదించిన 10 బిల్లులు గవర్నర్ ఆమోదం లేకుండానే చట్టరూపాన్ని దాల్చాయి. రాష్ట్రపతి, గవర్నర్ సంతకం లేకుండా చట్టసభ ఆమోదించిన బిల్లులు చట్టంగా మారడం తమిళనాడులోనే ఒక చారిత్రక సంఘటనగా పేర్కొనవచ్చు. అయితే గవర్నర్ ఆమోదం లేకుండా ఏ బిల్లైనా ఎలా చట్టరూపం దాలుస్తుంది అన్న అనుమానం అందరికీ కలగడం సహజం. దీనంతటికీ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పే కారణం. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న 10 బిల్లులకు క్లియరెన్స్ ఇస్తూ సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లులను తొక్కిపెట్టడం చట్టవిరుద్ధమని, సమ్మతిని తిరస్కరించిన బిల్లులను రాష్ట్రపతి ముర్ము కోసం పంపాల్సిన అవసరం లేదని పేర్కొంది. అలాంటి బిల్లులు అవి పంపిన తేదీ నుంచి అనుమతి పొందినట్టుగా పరిగణించవచ్చునని జస్టిస్ ఎస్‌బీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది. దీంతో గతంలో తాము ఆమోదించిన బిల్లులు 2023 నవంబర్ 18 నుంచి చట్టరూపం దాల్చినట్టు తమిళనాడు ప్రభుత్వం ఒక గెజిట్ నోటిఫికేషన్‌లో ప్రకటించింది. వీటిలో యూనివర్సిటీల వీసిల నియామకం, వారి నియామకాల్లో గవర్నర్ల అధికారాలను తగ్గిస్తూ చేసిన బిల్లు కూడా ఉంది.

ముగ్గురు మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

కొత్తగూడెం ప్రగతి మైదాన్: భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్, బీజాపూర్ జిల్లాలో శనివారం జరిగింది. బస్తర్ రేంజ్ ఐజీ పాటిలింగం తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రావతి నేషనల్ పార్క్ అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో కొలనార్ అడవిలో మావోయిస్టులు తారసపడి వారిపైకి కాల్పులు జరిపారు. ఇరు వర్గాల మధ్య గంట పాటు భీకర పోరు జరిగింది. కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు.

రెండో రోజూ రాణా విచారణ

న్యూఢిల్లీ: ఎన్ఐఏ కస్టడీలోని ముంబై 26/11 దాడి కేసు నిందితుడు తహవ్వూర్ రాణాను శనివారం రెండో రోజూ అధికారులు విచారించారు. తమ దర్యాప్తులో భాగంగా ఇప్పటికే తాము సేకరించిన పలు విషయాలపై ఆయనను ఎన్ఐఏ ప్రశ్నించింది. పాక్‌లో పుట్టి పెరిగిన రాణాకు, ఈ కేసులో సహ కుట్రదారుడు డేవిడ్ కోల్మన్ హెడ్లీ మధ్య పెద్దయెత్తున జరిగిన ఫోన్ సంభాషణల గురించి, ముంబై పేలుళ్లకు ముందు భారత్‌లో రాణా జరిపిన పర్యటనలకు సంబంధించిన కీలక సమాచారం విచారణలో లభ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

యూపీఐ సేవలకు మళ్లీ అంతరాయం

- నెల రోజుల్లో ఇది నాలుగోసారి
- చెల్లింపులు ఆగి ప్రజలకు ఇబ్బందులు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా యూపీఐ లావాదేవీలకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నెల రోజుల్లో నాలుగోసారి ఈ పరిస్థితి ఎదురవడంతో నగదు లావాదేవీలే నయమని, టెక్నాలజీని నమ్ముకుని ఆటోలు, హోటళ్ల వద్ద అవమానాలపాలవుతున్నామని సామాన్యులు సామాజిక మాధ్యమాల్లో వాపోయారు. డౌన్‌డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 11.26 గంటల నుంచి యూపీఐ చెల్లింపులకు అంతరాయం ఏర్పడింది. ఉదయం 11.40 గంటలకు ఈ సమస్య మరింత తీవ్రమైంది. తమ డిజిటల్ చెల్లింపులు విఫలమైనట్లు డౌన్ డిటెక్టర్‌కు 222 ఫిర్యాదులు వచ్చాయి. యూపీఐ మౌలిక సదుపాయాలను పర్యవేక్షిస్తున్న నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) దీనిపై స్పందిస్తూ, ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ప్రకటించింది.

వాట్సాప్ సేవల్లో అంతరాయం... యూజర్ల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు

ప్రముఖ మెసెంజర్ యాప్ వాట్సాప్ సేవల్లో శనివారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారత్‌లోని యూజర్లు యాప్‌ను ఉపయోగించటంలో అవాంతరాలు ఎదుర్కొన్నారు. వాట్సాప్ సందేశాలు వెళ్లడం లేదని, స్టేటస్‌లు అప్‌లోడ్ కావటం లేదని యూజర్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం 18 శాతం మంది మెసేజ్‌లు పంపటంలో ఇబ్బంది ఎదుర్కొన్నారని తెలిసింది.

ఇంజినీరింగ్ విద్యపై 'ఏఐ' ఎఫెక్ట్

- భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల అవసరం తగ్గొచ్చు
- సాఫ్ట్‌వేర్ కోడ్‌లన్నింటినీ ఏఐ రాసేస్తున్నది: నిపుణులు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : మనిషి ఎనిమిది గంటలు పనిచేస్తే.. ఏఐ (కృత్రిమ మేధ) నిర్విరామంగా పనిచేసే సామర్థ్యం కలిగి ఉన్నది. దీంతో ఆయా రంగాల్లో ఏఐ ప్రాధాన్యత, వాడకం అనూహ్యంగా పెరిగిపోయింది. ఈ క్రమంలో కృత్రిమ మేధ సాంకేతిక వినియోగం వల్ల ఫలితాలు ఎలా ఉంటాయనే చర్చ ఆయా వర్గాల్లో నెలకొన్నది. ఇంజినీరింగ్ విద్య, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లపై ఏఐ ప్రభావం పడనున్నట్టు నిపుణులు చెబుతున్నారు. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల అవసరం భారీగా తగ్గొచ్చని ఓపెన్ ఏఐ సీఈవో ఆల్ట్‌మన్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే సగానికిపైగా టెక్ కంపెనీల్లో ఏఐ కోడింగ్‌ను రాస్తున్నదని స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ ఉద్యోగాల అవసరం తగ్గుతుందని అన్నారు. ఒక్క ఏడాదిలో సాఫ్ట్‌వేర్ కోడ్‌లన్నింటినీ ఏఐ రాయగలదని ఆంథ్రోపిక్ సీఈవో డారియో అమోడై చెప్పారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను తప్పించొచ్చు

ఏఐ వినియోగంతో రాబోయే 18 నెలల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను పక్కకు తప్పించొచ్చు అని అమెరికాకు చెందిన సోషల్ క్యాపిటల్ సీఈవో పలిహపితియా అభిప్రాయపడ్డారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల భవిష్యత్తు ప్రమాదంలో ఉందని ఆయన హెచ్చరించారు. ఇంజనీర్ పాత్ర కనుమరుగు కానుందని అన్నారు.

సోనియా, రాహుల్ ఆస్తుల జప్తు

నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ దూకుడు

ఢిల్లీ, ముంబై, లక్నో ఆస్తులపై నోటీసులు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి సంబంధించిన ఆస్తుల జప్తు ప్రక్రియను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శనివారం ప్రారంభించింది. సోనియా, రాహుల్ గాంధీ యజమానులుగా ఉన్న యంగ్ ఇండియన్ లిమిటెడ్(వైఐఎల్) అధీనంలోని అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్(ఏజేఎల్)కు చెందిన ఢిల్లీ, ముంబై, లక్నోలోని ఆస్తుల్లో ఉంటున్న కంపెనీలు, వ్యక్తులకు ఏప్రిల్ 11న ఈడీ నోటీసులు జారీ చేసింది. ఒకప్పుడు నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రికను ప్రచురించిన ఏజేఎల్‌ను స్వాధీనం చేసుకోవడంలో ఆర్థిక అక్రమాలు, నిధుల దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసింది. బీజేపీ నాయకుడు డాక్టర్ సుబ్రమణియన్ స్వామి దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదైంది. రూ.2,000 కోట్ల మేర విలువైన ఆస్తులను దక్కించుకోవాలన్న దురుద్దేశంతో ఏజేఎల్ ఆస్తులను యంగ్ ఇండియా స్వాధీనం చేసుకుందని డాక్టర్ స్వామి తన ఫిర్యాదులో ఆరోపించారు. ఏజేఎల్ ఆస్తులకు సంబంధించిన రూ.988 కోట్ల మనీ లాండరింగ్ జరిగినట్లు తమ దర్యాప్తులో తేలిందని ఈడీ ఇదివరకు ప్రకటించింది. తదుపరి చర్యలలో భాగంగా ఆస్తుల జప్తు చర్యలను దర్యాప్తు సంస్థ ప్రారంభించింది. 2023 నవంబర్‌లో రూ. 661 కోట్ల విలువైన ఢిల్లీ, ముంబై, లక్నోలోని స్థిరాస్తులతోపాటు రూ.90.2 కోట్ల విలువైన ఏజేఎల్ షేర్లను ఈడీ ప్రాథమికంగా జప్తు చేసింది. ముంబైలోని హెరాల్డ్ హౌస్‌లో ఉంటున్న జిందాల్ సౌత్ వెస్ట్ ప్రాజెక్టులకు ఈడీ తాజాగా నోటీసులు జారీ చేసింది.

ఢిల్లీలో సుడిగాలుల బీభత్సం

205 విమానాలు ఆలస్యం ▪ చైనాలో కూడా ఇదే పరిస్థితి



న్యూఢిల్లీ: ఢిల్లీలో శుక్రవారం సాయంత్రం అకస్మాత్తుగా సుడిగాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో నగరంలోని విమానాశ్రయంలో దాదాపు 205 విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి. సుమారు 50 విమానాలను దారి మళ్లించారు. ఓ అధికారి మాట్లాడుతూ, చాలా విమానాలను దారి మళ్లించడం కానీ, రద్దు చేయడం కానీ జరిగిందన్నారు. దీనివల్ల ప్రయాణికులకు అసౌకర్యం కలిగిందని చెప్పారు. తాము దాదాపు 12 గంటలపాటు ఇబ్బందులు పడ్డామని కొందరు ప్రయాణికులు సామాజిక మాధ్యమాల్లో వెల్లడించారు. ఈ గాలుల వల్ల ఒకరు మృతి చెందగా.. ముగ్గురు గాయపడ్డారు. మరోవైపు చైనాలో శనివారం భీకర గాలులు బీభత్సం సృష్టించాయి. బీజింగ్‌లో చెట్లు నేలకొరిగాయి. దీంతో 693 విమాన సర్వీసులను అధికారులు తాత్కాలికంగా రద్దు చేశారు.

'వక్ఫ్'పై భగ్గుమన్న బెంగాల్

పలు జిల్లాల్లో హింసాత్మక దాడులు.. ముగ్గురి మృతి

కోల్‌కతా, ఏప్రిల్ 12: వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా శుక్రవారం పశ్చిమ బెంగాల్‌లో మొదలైన నిరసనలు శనివారం మరింత హింసాత్మకంగా మారాయి. రాష్ట్ర వ్యాప్తంగా ముగ్గురు మృతి చెందారు. పలు జిల్లాల్లో ఓ వర్గం ఇండ్లను దుండగులు, నిరసనకారులు టార్గెట్ చేస్తున్నట్టు తెలిసింది. శనివారం జాఫ్రాబాద్‌లో కొంతమంది దుండగులు, ఓ ఇంట్లోకి చొరబడి తండ్రి, కొడుకులపై మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆ ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్టు జిల్లా పోలీస్ అధికారి తెలిపారు. ధూలియాన్‌లో బుల్లెట్ గాయాలతో ఓ వ్యక్తి మరణించినట్టు పోలీసులు తెలిపారు. ముర్షిదాబాద్‌లో పోలీసులు దాదాపు 110మందిని అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు కేంద్రం తీసుకొచ్చిన వివాదాస్పద 'వక్ఫ్ సవరణ చట్టాన్ని' పశ్చిమ బెంగాల్‌లో అమలు జేయబోమని ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ మరోసారి ప్రకటించారు. అన్ని మతాలకు చెందినవారు ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలనే డిమాండ్‌తో త్రిపురలోని ఉనకోటి జిల్లాలో శనివారం జరిగిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. కుబ్జర్ ప్రాంతంలో నిరసనకారుల దాడిలో పోలీసు అధికారి సహా 18 మంది పోలీసులు గాయపడినట్లు పోలీసులు తెలిపారు.

ఉగ్రవాదుల కాల్పుల్లో సైనికాధికారి మృతి

సైన్యం చేతిలో ముగ్గురు టెర్రరిస్టులు హతం

శ్రీనగర్: కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్మూ కశ్మీర్‌లో మళ్లీ ఉగ్రవాద కార్యకలాపాలు ఉధృతమయ్యాయి. శుక్ర, శనివారాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఒక ఆర్మీ జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్(జేసీవో), ముగ్గురు ఉగ్రవాదులు మరణించారు. జమ్మూకు చెందిన అఖ్నూర్ సెక్టార్‌లోని ఖేరీ భట్టల్ ప్రాంతంలో పాకిస్థాన్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు పాల్పడింది. శుక్రవారం రాత్రి ఉగ్రవాదులు వాస్తవాధీన రేఖ వద్ద చొరబాటుకు యత్నించగా, భారత సైన్యం వారిపై కాల్పులు జరిపింది. ఉగ్రవాదుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డ జేసీవో, అనంతరం మరణించారు.

ఉగ్ర దాడులు జరగొచ్చు

నిఘా వర్గాల హెచ్చరిక

న్యూఢిల్లీ : ముంబై 26/11 పేలుళ్ల నిందితుడు తహవ్వూర్ రాణాను అమెరికా నుంచి భారత్‌కు తీసుకువచ్చిన క్రమంలో దేశంలో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని నిఘా సంస్థలు ఉన్నత స్థాయి హెచ్చరికలు జారీ చేశాయి. ప్రస్తుతం రాణాను ఎన్ఐఏ ప్రశ్నిస్తున్నది. ఈ క్రమంలో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు 2008లో చేసినట్టు జల మార్గాల్లో భారత్‌లోకి చొరబడవచ్చునని, దేశ వ్యాప్తంగా వారు డ్రోన్, ఐఈడీ దాడులు చేసే అవకాశం ఉందని నిఘా సంస్థలు హెచ్చరించాయి. దీంతో భారత రైల్వే అప్రమత్తమైంది. ప్రధాన స్టేషన్లు, రైలు మార్గాల్లో ప్రయాణికుల సాంద్రత, హైరిస్క్‌లో ఉన్న జోన్లలో భద్రతను కట్టుదిట్టం చేసింది.

చిత్త వైకల్యం వివాహితులకే ఎక్కువ!

ఫ్లోరిడా స్టేట్ వర్సిటీ పరిశోధనలో వెల్లడి



న్యూఢిల్లీ: 'పెండ్లి చేయండి.. పిచ్చి కుదురుతుంది' అంటూ మన పెద్దలు చెప్పిన మాటలను వింటుంటాం. అయితే వాస్తవానికి పెండ్లి చేస్తే పిచ్చి తగ్గడం మాట దేవుడెరుగు పెరిగే అవకాశం ఎక్కువగా ఉందని, పెండ్లి కాని వారి కన్నా అయిన వారికే అది వచ్చే అవకాశం ఎక్కువ ఉందని అంటున్నారు కొందరు పరిశోధకులు! కాబట్టి పెండ్లి కాలేదనో, విడాకులు పొందామనో చింతించకండి అంటున్నారు వీరు. వివాహం కాకుండా సింగిల్‌గా ఉన్నవారు లేదా వివాహం విచ్ఛిన్నమై ఉన్న వారికి డిమెన్షియా (చిత్త వైకల్యం) వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని వెల్లడించారు ఫ్లోరిడా స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు. జీవితంలో మతిభ్రంశం కలగకుండా ఉండాలంటే పెండ్లికి దూరంగా ఉండండని వీరు సలహా ఇస్తున్నారు. అదేంటి ఇంతవరకు పెండ్లి చేసుకుంటే మంచిదంటూ దీనికి వ్యతిరేకంగా అనడాన్ని విన్నామే అంటున్నారా? అదీ నిజమే! 2019లో అమెరికాలో జరిగిన ఒక పరిశోధన ప్రకారం వివాహితులైన వారి కంటే అవివాహితులకు చిత్తవైకల్యం వచ్చే గణనీయ అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు అప్పట్లో తెలిపారు. వాస్తవానికి వైవాహిక జీవితం అనంతరం వివాహితులు మంచి ఆరోగ్యంతో ఉంటారని ప్రజలు భావిస్తుంటారు. అంతేకాకుండా ఇప్పటివరకు జరిగిన పరిశోధనలు కూడా హృద్రోగాలు, స్ట్రోక్ వంటి ప్రమాదకర వ్యాధులు అవివాహితుల కన్నా వివాహితులకు తక్కువగా వస్తాయని తెలిపారు. అయితే కొత్త పరిశోధన మాత్రం వీటన్నింటి కన్నా భిన్నమైన, ఆశ్చర్యకరమైన ఫలితాలను వెలువరించింది. దానిని ఒకసారి పరిశీలిద్దాం.

24 వేల మందిపై 18 ఏండ్ల పరిశోధన

ఈ పరిశోధకులు డిమెన్షియా వ్యాధి లేని 24 వేల మంది అమెరికన్లను ఎంపిక చేశారు. వీరిని 18 ఏండ్ల పాటు పరిశీలించారు. వీరిని వివాహిత, విడాకులు, వైధవ్య, ఎన్నడూ వివాహం చేసుకోని వ్యక్తుల గ్రూపులుగా విభజించారు. తొలుత వివాహితుల గ్రూప్‌తో పోలిస్తే మూడు అవివాహిత గ్రూపుల వారికి డిమెన్షియా వ్యాధి ప్రమాదం తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. చిత్తవైకల్యంపై సంబంధాల ప్రభావం చాలా క్లిష్టంగా ఉంటుందని ఈ పరిశోధకులు పేర్కొన్నారు.

రోదసి వ్యర్థాల రీసైక్లింగ్ ఎలా?

పరిష్కారం సూచిస్తే బహుమతిగా రూ.25.82 కోట్లు: నాసా

వాషింగ్టన్: రోదసిలో పోగుపడిన మానవ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడానికి తగిన పరిష్కారాన్ని సూచిస్తే రూ.25.82 కోట్లు (3 మిలియన్ డాలర్లు) బహుమతి ఇస్తామని అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రకటించింది. చంద్రుడు, ఇతర రోదసియానాల్లో వ్యోమగాముల మలమూత్రాలు, వాంతులు దాదాపు 100 సంచులతో ఉన్నట్లు నాసాకు చెందిన లూనా రీసైకిల్ ఛాలెంజ్ వెల్లడించింది. దీనిని అంతరిక్షంలోనే రీసైకిల్ చేసేందుకు తగిన టెక్నాలజీని అభివద్ధి చేయడానికి సాయపడాలని ప్రజలను కోరింది. రోదసిలో మనుషుల వ్యర్థాలతోపాటు ఫుడ్ ప్యాకేజింగ్, బట్టలు, పాడైన పరికరాలూ ఉన్నాయని పేర్కొంది. ఈ ఛాలెంజ్‌లో రెండు ట్రాక్‌లు ఉంటాయి. బృందాలుగా, వ్యక్తిగతంగా పాల్గొనవచ్చు. ప్రవేశ రుసుము లేదు. ట్రాక్-1లో కఠినమైన చంద్రుని వాతావరణంలో పనిచేసే ఫుల్ రిసోర్స్ రికవరీ సిస్టమ్ డిజిటల్ మోడల్‌ను డిజైన్ చేయాల్సి ఉంటుంది. ట్రాక్-2లో ఇలాంటి సిస్టమ్‌లో వినియోగించదగిన ముఖ్యమైన కాంపొనెంట్ లేదా సబ్‌సిస్టమ్ వర్కింగ్ ప్రోటోటైప్‌ను నిర్మించడం, ప్రదర్శించడంపై దృష్టి పెట్టాలి.